
సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్



ప్రత్తిపాడు/పొన్నూరు: ఎన్నికల సమయంలో కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలపై వీధి వీధినా విస్తృతంగా ప్రచారం చేశారు. బాబొస్తున్నాడు.. మంచి రోజులొస్తున్నాయంటూ ఊదరగొట్టారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని నమ్మ బలికారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి అంటూ 'భ్రాంతి' కల్పించారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు సాయం అందిస్తామని చెప్పారు. ప్రతి నెలా మహిళలకు రూ.1,500 ఇస్తామని ప్రగల్భాలు పలికారు. ప్రజలు నమ్మారు. పట్టం కట్టారు. కొత్త పాలకులు గద్దెనెక్కి వంద రోజులు పూర్తయింది. కానీ సూపర్‌సిక్స్ మాత్రం బౌండరీ లైన్ దాటడం లేదు.

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికలకు వారం ముందు టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రకు మార్కు గెలిపించడమే ధ్యేయంగా పొన్నూరులోని బహిరంగ సభలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరతామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కానీ ఆయన ఇచ్చిన హామీలు నేటికీ ఆచరణలోకి రాకపోవడం దురదృష్టకరం.
- 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు గద్దెనెక్కే సమయానికి రాష్ట్ర ఖజానాలో రూ.100 కోట్లు కూడా లేని పరిస్థితి. కరోనా మహమ్మారి పంజా విసరడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమయ్యింది. కానీ ఇచ్చిన మాటకు కట్టుబడి మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి పథకాలను ప్రతి ఇంటికీ గడప వద్దకే తీసుకువెళ్లారు. కానీ చంద్రబాబు మాత్రం అప్పుల లెక్కల మాటలు చెబుతూ సూపర్‌సిక్స్ చూస్తే భయమేస్తోందంటూ అసెంబ్లీ సాక్షిగా ఏరుదాటిన తరువాత తెప్ప తగలేసే సామెత చందంగా మాటలు చెబుతున్నారు.

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

ప్రత్తిపాడు	77,327
పొన్నూరు	92,765

నెలకు ఇవ్వాల్సిన సాయం రూ. 51,19,81,000

జగన్ పాలనలో ఐదేళ్లలో రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	ప్రత్తిపాడు	147.35
	పొన్నూరు	177.04



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

ప్రత్తిపాడు	34,300
పొన్నూరు	38,164

అందాల్సిన సాయం రూ.144.92 కోట్లు

జగన్ పాలనలో ఐదేళ్లలో తల్లికి అందిన సాయం

పథకం	నియోజవకర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	ప్రత్తిపాడు	74.88
	పొన్నూరు	101.03



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

ప్రత్తిపాడు	25,100
పొన్నూరు	58,800

అందాల్సిన సాయం రూ.125.85 కోట్లు



ప్రతి మహిళకు నెలకు రూ.1,500

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

ప్రత్తిపాడు	1,19,894
పొన్నూరు	70,000

నెలకు అందాల్సిన సాయం రూ. 28,48,41,000

అన్నదాత సుఖీభవ ఎప్పుడిస్తారు..?



అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారు? ఇప్పటికే పంటల సాగు మొదలయ్యింది. కొందరు రైతులు పంటలనూ సాగు చేశారు. పెట్టుబడుల కోసం దిక్కులు చూడాల్సిన పరిస్థితి. ఎన్నికల సమయంలో చెప్పిన హామీ ప్రకారం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలి. రైతులు అప్పుల కోసం చూసే పరిస్థితి లేకుండా చూడాలి. గత ప్రభుత్వంలో పంటల సాగుకు ఉపకరించేలా సమయానికి రైతు భరోసాను అందించారు.

– బాపతు వెంకటేశ్వరరెడ్డి, రైతు, ప్రత్తిపాడు

నిరుద్యోగ భృతి ఎక్కడ..?



యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా మూడు వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేసి వంద రోజులు కావస్తున్నాయి. కానీ నిరుద్యోగ భృతి జాడలు కనిపించడం లేదు. వెంటనే పథకం అమలు చేసి నిరుద్యోగులకు ప్రభుత్వం అండగా నిలవాలి.

– ఎం. రాజశేఖర్, కాకుమాను

మహిళలకు రూ.1500 ఏవీ ?



ప్రతి ఇంటిలో మహిళలకు నెలకు రూ.పదిహేను వందలు ఇస్తామన్నారు. ఎప్పటి నుంచి ఇస్తారో తెలియజేయాలి. ప్రతి ఇంటా పథకం అమలు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వంద రోజులు గడిచాయి. విధివిధానాలను వెంటనే ప్రకటించాలి.

– టి.శ్రీలక్ష్మి, జన్మభూమికాలనీ, గుంటూరు రూరల్ మండలం

తల్లికి వందనం ఈ ఏడాదే అమలు చేయాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటూ ఉంటే అంత మందికీ ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున ఇవ్వాలి. ఈ ఏడాది నుండే అమలు చేస్తారని భావించాం. కానీ పరిస్థితి చూస్తుంటే అమలయ్యేలా కనిపించడం లేదు. ఎంతో మంది తల్లులు తల్లికి వందనంపై ఆశలు పెట్టుకున్నారు.

– ఎస్.సంధ్యారాణి, గృహిణి, ప్రత్తిపాడు

• తూతూ మంత్రంగా కడ'గండ్ల' పూడ్చివేత

వరదలు, అధిక వర్షాలకు కాలువ కట్టలకు పడిన గండ్లను తూతూ మంత్రంగా పూడ్చడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వచ్చిన వరదలతో మండలంలోని గుంటూరు చానల్, హైలెవల్ చానల్, మురుగు కాలువ కట్టలకు గండి పడి పంట పొలాలు ముంపునకు గురైన సంగతి తెలిసిందే. చెరువుల మాదిరిగా కనిపిస్తున్న పొలాల్లో నీరు బయటకు పోవడానికి అధికారులు కాలువలకు నీటి సరఫరా నిలిపివేశారు. ప్రవాహం తగ్గడంతో పొక్లెయిన్ ద్వారా గండి పడిన కాలువ కట్టలకు గండ్లు పూడ్చారు. పలుచోట్ల గండ్లు నామమాత్రంగానే పూడ్చడంతో కాలువలకు నీరు ఎక్కువగా వదిలినా, ప్రకృతి విపత్తుల కారణంగా అధిక వర్షాలు కురిసినా మళ్లీ గండ్లు పడే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గండ్లను పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలతో పూడ్చాలని, కాలువ కట్టలను బలోపేతం చేసి గండ్లు పడకుండా చూడాలని కోరుతున్నారు.

–పెదకాకాని



పెదకాకాని మంచినీటి చెరువు, మురుగు చెరువుకు మధ్య పడిన గండికి ఇసుక బస్తాలు వేస్తున్న కూలీలు



గుంటూరు చానల్(కొత్త కాలువ) వద్ద నాసిరకంగా పూడ్చిన గండి



నంబూరు శివారులో హైలెవల్ చానల్(పాత కాలువ)కు మొక్కుబడిగా పూడ్చిన గండి



గుంటూరు చానల్ లాకుల వద్ద ఏర్పడిన గండికి వేసిన ఇసుక బస్తాలు

భవనం పూర్తయినా కాలయాపనే !

- శిథిల భవనంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అవస్థలు
- అరకొర పనులతో నిలిచిన కొత్త భవన నిర్మాణం

పొన్నూరు : నిర్మాణ పనులు పూర్తయినా ప్రభుత్వ భవనాలను అందుబాటులోకి తీసుకు రావడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పొన్నూరు పట్టణంలో నూతన అగ్నిమాపక కేంద్ర భవనాన్ని నిర్మించారు. ప్రధాన పనులు పూర్తయి రెండేళ్లు దాటుతోంది. నిర్మాణానంతరం లోపల చిన్నపాటి పనుల కారణంగా భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు.

పాత భవనంలోనే విధులు

పట్టణంలోని విశాలమైన ప్రదేశంలో 1984లో నిర్మితమైన అగ్నిమాపక కేంద్రం శిథిలావస్థకు చేరింది. భవనం పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. సిబ్బంది అవస్థలను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు నూతన భవన నిర్మాణానికి సుమారు రూ. 70 లక్షల వరకు మంజూరు చేశారు. భవనం నిర్మాణం స్లాబుతో పాటు ఎపెయింటింగ్ వర్క్ కూడా పూర్తయింది. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఏళ్ల తరబడి భవనం వినియోగంలోకి రావడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. చిన్న చిన్న పనుల కారణంగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఫలితంగా సిబ్బంది పాత శిథిల భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లు కూడా అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్ పనుల్ని పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టి భవనాన్ని ప్రారంభించాలని సిబ్బంది కోరుతున్నారు.



అగ్ని మాపక కేంద్రం పాత భవనం



కొత్త భవనం

వెంటనే ప్రారంభించేలా చర్యలు



అగ్నిమాపక కేంద్రం నూతన భవనంలో నిలిచిన పనుల్ని త్వరలోనే ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాం. సిబ్బంది ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తాం.

– ప్రసాదరావు, సీఐ, అగ్నిమాపక కేంద్రం, పొన్నూరు

క్లుప్తంగా

రేపటి నుంచి క్రీడా పోటీలు

పెదకాకాని: మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతాయని ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతి రావు తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య గుంటూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్- 14, అండర్- 17 విభాగాల్లో అన్ని మేనేజ్‌మెంట్ స్కూళ్లలో చదువుతున్న బాలబాలికలు కూడా అర్హులని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు చదువుతున్న పాఠశాల నుంచి ధ్రువీకరణ పత్రం తప్పకుండా తీసుకు రావాలని సూచించారు. ఈనెల 20న వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో వాలీబాల్, ఖోఖో, యోగా పోటీలు, 21న కబడ్డీ, షటిల్, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న నంబూరు శ్రీ వేమన ప్రోలయ జిల్లా పరిషత్ పాఠశాలలో అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరికీ ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని హెచ్ఎం వివరించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం



పెదకాకాని: వరద బాధితుల సహాయార్థం పెదకాకాని గ్రామానికి చెందిన ఆర్టీసీ విశ్రాంత అధికారి, రోటరీ క్లబ్ సెంటినల్ సభ్యుడు, అమ్మానాన్న చారిటబుల్ సభ్యుడు గోకనకొండ శరత్‌బాబు బుధవారం విజయవాడలో సీఎం నారా చంద్రబాబునాయుడును కలసి లక్ష రూపాయల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పిల్లి మాణిక్యారావు, కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



పొన్నూరు: పట్టణంలోని డ్రెయిన్లలో పూడిక తీత చేపట్టి మురుగు సమస్యకు పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల రూ. 35 లక్షల వ్యయంతో 31 వార్డుల్లో చేపట్టిన పూడికతీత పనులు సరిగా జరగకపోవడంతో ప్రజల ఇబ్బందులను తెలియజేస్తూ 'లక్ష్యం వృథా.. జనం వ్యథ' శీర్షికన సాక్షి పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద, పలు వార్డులోని డ్రెయిన్లలో చెత్త, వ్యర్థాలను తొలగించారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాల రమేష్ బాబు పనుల్ని పరిశీలించి, ప్రజారోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పోషకాహారంతో ఆరోగ్య పరిరక్షణ

పౌష్టికాహారంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా జీవించవచ్చని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. గోరంట్లలోని కళాశాలలో బుధవారం బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పోషకాహారాలైన కార్బొహైడ్రేట్స్, విటమిన్స్, కొవ్వులు, ప్రొటీన్‌లు, సూక్ష్మపోషకాలు, చిరుధాన్యాల గురించి వివరించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకుంటే మానసికంగా, శారీరకంగా, దృఢంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్. షారోన్‌రోజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలతో ఉన్నత అవకాశాలు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగు పరుచుకుని ఉజ్వల భవిష్యత్తు దిశగా కృషి చేయాలని ఏపీ ప్రభుత్వ రిలేషన్స్, రీజినల్ లీడ్ అకడమిక్ ఆఫీసర్ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం ఐటీ, పారిశ్రామిక నైపుణ్యాలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సాంకేతిక నైపుణ్యతలను సద్వినియోగించుకుని అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. జన్‌ప్యాక్ట్ సీనియర్ మేనేజర్ సుమియంఅజీజ్ మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామికంగా ఎదిగే విధానం, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ ఆర్. షారోన్‌రోజ్, ఉపాధి కల్పనాధికారి జె. ప్రతాపరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిత



పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ట్రస్టు చైర్మన్ వేణుగోపాల్ తదితరులు

చేబ్రోలు: విద్యార్థుల్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. చేబ్రోలులోని యూటీఎఫ్ మండల కార్యాలయంలో ఏపీజే అబ్దుల్ కలాం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. చేబ్రోలు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 16మంది ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సామాన్య, మధ్యతరగతి, పేద వర్గాల పిల్లలు వస్తాయని, వారిని ఉపాధ్యాయులంతా ఉన్నతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ఆటంకంగా ఉన్న జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చశారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు కనీస హక్కులు, సౌకర్యాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లగడపాటి సీతారామయ్య ట్రస్ట్ చైర్మన్ వేణుగోపాల్, దీప్తి పబ్లికేషన్స్ అధినేత ఏ.ఆంజనేయులు, యూటీఎఫ్ నాయకులు వై. రమేష్‌బాబు, నాగేశ్వరరావు, విజయరాజు,

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకురాలికి డాక్టరేట్



సరయు

గుంటూరు రూరల్: ఆర్‌వీఆర్‌జేసీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వున్నం సరయుకు తమిళనాడుకు చెందిన అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ఫొటో వోల్టాయిక్ మెటీరియల్స్ ఫర్ మేగ్జిమమ్ పవర్ ఎన్‌హేన్స్‌మెంట్ ఫ్రం ఫొటో వోల్టాయిక్ అరె అండర్ పార్షియల్ షేడింగ్ సిట్యుయేషన్ అనే అంశంపై అన్నామలై విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఎం. వనితశ్రీ, ఆర్వీఆర్‌జేసీకి చెందిన డాక్టర్ రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ను కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, కె. చంద్రశేఖర్ అభినందించారు. కళాశాలలో ఇప్పటివరకూ డాక్టరేట్ పొందిన అధ్యాపకులు 148 మంది ఉన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.